శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ

- జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం - జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 21 యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్టణంలో నిర్వహించే సామూహిక యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు పాల్గొంటున్నారని, అందుకనుగుణంగా జిల్లావ్యాప్తంగా వార్డు, గ్రామస్థాయి నుంచి ప్రతిఒక్కరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# నెల్లూరు జిల్లా మాజీ ఎంపీకి బారీ షాక్

- 15 కోట్లు విలువ జేసే 2 ఎకరాల స్థలాన్ని స్వాధీనం
- అహోబిలం మఠం స్థలంగా గుర్తింపు
- రెండు ఎకరాల స్థలంలో బోర్డు నాటిన రెవెన్యూ అధికారులు




**నెల్లూరు రూరల్, జూన్ 19, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారి సాక్షి ప్రధాన కార్యాలయం పక్కన సర్వే నెంబర్ 295లో అహోబిలం మఠంకు చెందిన రెండు ఎకరాల స్థలం ఉండేది. అయితే కాలక్రమేనా ఈ స్థలాన్ని ఓ మాజీ పార్లమెంటు సభ్యుడు తనకున్న అధికార బలంతో తాను సొంతం చేసుకున్నాడు. మాజీ ఎంపీ కున్న పలుకుబడి, ఆర్థిక బలంతో అహోబిలం పీఠం వారు ఈ స్థలం కోసం ఎన్నిసార్లు పోరాటం చేసిన అది సఫలం కాలేదు. అధికారుల దృష్టికి అప్పటి పాలకుల దృష్టికి తీసుకువెళ్లిన వారు దీనిపై చర్యలు తీసుకోలేదు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం అహోబిలం పీఠం ప్రతినిధులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కలిసి తమ సమస్యను తెలియజేయడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడంతో వెంటనే రూరల్ ఎమ్మెల్యే స్పందించి సాక్షి కార్యాలయం పక్కన ఉన్న రెండు ఎకరాల స్థలానికి సంబంధించి పూర్వ పరాలను సేకరించి ఇది అహోబిలం పీఠం స్థలంగా నిర్ధారించారు. రెవిన్యూ అధికారులు కూడా ఈ అంశంపై స్పందించి 15 కోట్లు విలువ చేసే ఈ రెండు ఎకరాలు స్థలంలో ఈ స్థలం అహోబిలం పీఠంకు చెందిందని గురువారం బోర్డు నాటారు. రెవిన్యూ అధికారుల చర్యలతో మాజీ ఎంపీకి గట్టి షాక్ తగిలింది.

# అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించండి

- కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 19 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించడంతోపాటు వేగవంతంగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లను పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ విభాగానికి ఇంటింటి చెత్త సేకరణకు అవసరమైన వాహనాలను సమకూర్చి, వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్లు చూసుకోవాలని తెలిపారు. అన్ని ప్రధాన డివిజన్లలో అవసరమైన డివైడర్ల నిర్మాణం, డివైడర్ల పెయింటింగ్ పనులు, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పెయింటింగ్ పనులను నిర్దేశించిన సమయానికి పారదర్శకంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ ఇ రామ్ మోహన్ రావు, ఈ.ఈలు శేషగిరిరావు, రహంతు జానీ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, డి.ఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ప్రమాదభరితంగా కేబుల్ వైర్లు



**బుచ్చి జూన్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగ పంచాయితీలో పలు కేబుల్ వైర్లు కిందకి వేలాడు ప్రజలను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. గత రెండు రోజుల క్రితం ఓ యువకుడు రాత్రి వేళలో బైకు పైన వస్తు వైరు గొంతుకు వేసుకోవడంతో అతనికి గాయాలు అయ్యాయి. విద్యుత్ స్తంభాలకు ఇష్టానురంగా కేబుల్ వైర్లు కట్టి వేయడం, కిందకి వేలాడతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈవిషయంపై స్పందించిన ట్రాన్స్ కో డిఇ సతీష్ కేబుల్ ఆపరేటర్లకు నోటీలసు జారి చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ట్రాన్స్ ఏడి సతీష్ పరామర్శించారు.

# శ్రీలక్ష్మీ నరసింహస్వామి సేవలో ఎమ్మెల్యేలు



**వింజమూరు, జూన్ 19, ప్రభాతవార్త** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో వేంచేసి యున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి సేవలో తరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పరంకుశం సత్యనారాయణ చార్యులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు ఆలయ ప్రదక్షిణ చేసి పురోహితుల ద్వారా ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. ఆలయ చైర్మన్ లెక్కల చిన్న కొండారెడ్డి వేద పండితులు అతిధులకు ఘన స్వాగతం పలికి శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ ఆలయం చాలా పురాతనమైనదని, చారిత్రాత్మకమైనదని తెలిపారు. మహిమాన్వితమైన ఈ నీలగిరి పర్వతంపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శ్రీ గృహ మల్లేశ్వర స్వామి కొలువై ఉన్నారని వారి ఆశీస్సులతోనే ఈ గ్రామంతో పాటు పరిసర గ్రామాలన్నీ శాంతి సౌభాగ్యాలతో వెలుసిల్లుతున్నాయని తెలిపారు. అలాగే ఈ ప్రాంతాన్ని కాపాడేందుకు క్షేత్రపాలకుడైన శ్రీ ఆంజనేయస్వామి కొలువుదీరి యున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లెక్కల లక్ష్మీకాంతమ్మ, ఉండేలా గురువారెడ్డి, చీకుర్తి రవీంద్రబాబు, కాకర్ల వెంకట్, మాలేపాటి చైతన్య నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



# జాయింట్ పట్టాదారుల భూములను ఉచితముగా సబ్ డివిజన్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** జిల్లాలో రీ సర్వే పూర్తి కాబడిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం మొదలైన పథకాలను పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించుటకు గాను ప్రభుత్వము ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను రెవెన్యూ డిపార్ట్మెంట్ సబ్ డివిజన్ సేవ కోసం నిర్ధారించిన రూ. 500 రుసుమునకు మినహాయింపు ఇచ్చి కేవలము నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ. 50 సంబంధిత గ్రామ సచివాలయముల్లో చెల్లించినచో, జాయింట్ పట్టాదారుల భూములను ఉచితంగా సబ్ డివిజన్ చేయనున్నట్లు జేసీ తెలిపారు. 30 తేదీల్లోగా అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జెసి పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ యోగాదినోత్సవం, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సంయుక్తంగా నిర్వహణ

## జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 21వ తేదీ మూడో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఒక ప్రకటనలో ఆదేశించారు. శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు వార్డు స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఎంపిక చేసిన ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో కామన్ యోగా ప్రోటోకాల్‌ను పాటించాలన్నారు. యోగా కార్యక్రమం ముగిసిన అనంతరం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యాలయలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. అన్ని సచివాలయాలు, పార్కులు, కార్యాలయాల్లో, పాఠశాలల్లో గ్రీన్ యోగా కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని పెంపొందించేలా యోగా నినాదాలతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. యోగా, స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. యోగా, స్వర్ణంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాలను పర్యావరణహితంగా చేపట్టాలని, ఎక్కడా కూడా ప్లాస్టిక్ వాడకుండా క్లాత్ మ్యాట్స్ వినియోగించాలని, ఆర్గానిక్ స్నాక్స్‌ను అందించాలని, తిరిగి వినియోగించే వాటర్ బాటిల్స్, కప్స్, ప్లేట్లను వినియోగించాలని పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు, స్వయం సహాయక సంఘ మహిళలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అందరూ పెద్ద ఎత్తున యోగాంధ్ర, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మారుతున్న టెక్నాలజీ ద్వారా రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోండి

## కలెక్టర్ ఓ.ఆనంద్





**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 19, ప్రభాతవార్త** వ్యవసాయ రంగంలో వేగంగా మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని ఆ రంగాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. నెల్లూరు ఆకుతోట వద్దనున్న వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో రైతులకు యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ 50 శాతం రాయితీతో రైతులకు వ్యవసాయ పరికరాలను అందించడం శుభ పరిణామం అన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా రైతులు కూడా మారాలన్నారు. ప్రభుత్వం రాయితీతో అందించే యంత్ర పరికరాలను పొంది తద్వారా రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీ పట్ల వ్యవసాయ శాఖలో సిబ్బందికి కూడా శిక్షణ ఇప్పించి రైతులకు అవగాహన కల్పించే దిశగా ముందుకెళ్లాలని వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణికి సూచించారు. రాబోయే ఐదు పదేళ్లలోమిషనరీ లేకుండా వ్యవసాయం సాధ్యం కాదన్నారు. ఆ రంగంలో వ్యవసాయ కూలీల సమస్యను అధిగమించాలంటే యాంత్రికరణ మార్గం ఒక్కటే దిక్కు అన్నారు. వేగంగా పెరుగుతున్న టెక్నాలజీ ద్వారా దేశంలో ఏ పంట ఎంత మేర పండిస్తున్నారో శాటిలైట్ ద్వారా నిమిషాలలో తెలుసుకోవచ్చని తెలిపారు. అన్ని పంటలను పండించడం ద్వారా చిరుధాన్యాల కొరతను అధిగమించవచ్చని రైతులు ఆ దిశగా ముందుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 2,86,96,220 రూపాయల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి, ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ విద్యా సాగర్, ఏడీలు నర్సోజిరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# లా అండ్ ఆర్డర్ ఉల్లంఘిస్తామంటే తాట తీస్తారు జాగ్రత్త



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త :** వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వర రావు ఆత్మహత్యకు కారకుడు జగన్ రెడ్డే వైనాట్ 175 అంటూ బెట్టింగ్ ను ప్రోత్సహించాడు నిన్న పోలీస్ ఆంక్షలను ఉల్లంఘించి రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాడు రపారపా నరుకుతామంటూ ప్రజలకు ఏం సందేశమిస్తున్నారు బెట్టింగ్ లో నష్టపోయి నాగమల్లేశ్వర రావు ప్రాణాలు తీసుకుంటే పోలీసులు కూటమి ప్రభుత్వా నికి ఏం సంబంధం నాగమల్లేశ్వరరావు చనిపోయిన జూన్ 9న సీఎం ఎవరు..జగన్ రెడ్డి కాదా శాంతిభద్రతలు అదుపులో ఉండటం జగన్ రెడ్డికి ఇష్టం లేదు అన్నమయ్య డ్యాం తెగిపోయినప్పుడు సీఎంగా ప్రజల మధ్యలోకి రాని వ్యక్తి ఇప్పుడు పరామర్శల పేరుతో హడావిడా కేబినెట్ లో కమ్మ కులస్తులకు అవకాశం ఇవ్వని జగన్ కు ఆ సామాజిక వర్గం పేరెత్తే అర్హతే లేదు ఏపీ చరిత్రలోనే ఆయన ఒక బ్లాక్ మార్క్ దుత్తలూరులో మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి బరితెగించి ప్రవర్తిస్తున్నారు నిన్న రెంటపాళ్లలో నాగమల్లేశ్వర రావు పరామర్శ పేరుతో రౌడీమూకలతో ప్రదర్శన నిర్వహించాడు పోలీస్ ఆంక్షలను ఉల్లంఘించి రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాడు రఫారఫా నరుకుతాం అని ప్లకార్డులు ప్రదర్శించి ఏం సందేశమిస్తున్నారు జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అప్పట్లో ఎలా ఎన్నికయ్యాడో అర్థం కావడం లేదు వైసీపీ ఐదేళ్ల పాలనలో బీహారే మేలు అనేలా ఏపీని భ్రష్టు పట్టించారు ఇంకా ఆ భ్రమల్లోనే జగన్ రెడ్డి ఉన్నాడు రెంటపాళ్ల నాగ మల్లేశ్వరరావు చనిపోయిన 2024 జూన్ 9 నాటికి ఆపద్ధర్మ సీఎం జగన్ రెడ్డి కాదా చంద్రబాబు నాయుడు జూన్ 12న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రభుత్వం ఏర్పాటు చేశారు జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చే నాటికి వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు బెట్టింగులు కట్టి నిండా మునిగిపోయాడు వైనాట్ 175 అని ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డి మాటలు నమ్మి నాగమల్లేశ్వరరావు పందేలు కట్టి ప్రాణాలు తీసుకున్నాడు నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు జగన్ రెడ్డే కారణం జగన్ రెడ్డి ఇచ్చిన హోప్ తోనే ఆయన బెట్టింగ్ లు కట్టి నిండా మునిగిపోయాడు ఆయన చావును టీడీపీకి అంటగట్టేందుకు పోలీసుల వేధింపులని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడు బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న వారి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వెళ్లడానికి సిగ్గుందా నాగమల్లేశ్వరరావు విగ్రహం చూసి అందరూ ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలా జగన్ రెడ్డిలో అసలు నైతికత లేకపోవడం దురదృష్టకరం శాంతిభద్రతలు అదుపులో ఉండాలని జగన్ రెడ్డి కోరుకోవడం లేదు రాష్ట్రమంతా పులివెందుల ఫ్యాక్షనిజం విస్తరించాలని కోరుకుంటున్నాడు వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అరాచక ఆంధ్రప్రదేశ్ గా మార్చాడు..ఇప్పుడు కూడా అదే ధోరణిలో ఉన్నాడ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం బాగుపడు తుండటం చూసి కడుపు మంటతో రగిలిపోతున్నాడు ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా ఆయనకు బుద్ధిరాలేదు శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాజీపడదు వైసీపీ పాలనలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి సుమారు 50 మంది ప్రాణాలు కోల్పోయారు సొంత జిల్లా ప్రజలు ఘోర విపత్తులో చిక్కుకుంటే ముఖ్యమంత్రిగా హెలికాప్టర్ లో విహరించిపోయాడు అప్పటి ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు నాయుడుతో కలిసి మేమంతా కష్టాల్లో ఉన్న ప్రజల మధ్య తిరిగాం నారా భువనేశ్వరమ్మ ప్రతి బాధిత కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం చేశారు నేను, నా రౌడీ కట్ట రోడ్లపైకి వస్తే పోలీసులు ఏం చేయలేరని జగన్ రెడ్డి అనుకుంటున్నాడేమో..తాటతీసి వదిలిపెడతారని గుర్తుంచుకోవాలి చట్టాలు ఎవరికీ చుట్టాలు కాదని తెలుసుకోవాలని హితవు పలుకుతున్నాం జగన్ రెడ్డిని, ఆయన రౌడీ బ్యాచ్ స్లోగన్లు, ఫ్లకార్డులను చూసి ఎవరూ భయపడరు చనిపోయిన కుటుంబానికి పరామర్శకు వెళుతూ ఆ ర్యాలీలేంటి నినాదాలేంటి ఫ్లకార్డులేంటి జగన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కే ఒక బ్లాక్ మార్క్ స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిలా ఘోరమైన చెడ్డపేరు తెచ్చుకోలేదు ఇష్టప్రకారం రాష్ట్ర భవిష్యత్తుతో ఆడుకుంటామంటే కుదరదు,అదుపులో ఉంటే మంచిది వైసీపీలోని కమ్మ కులస్తులు చంద్రబాబు నాయుడికి నచ్చడం లేదని కూడా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు వైసీపీ ప్రభుత్వంలో 2022లో మంత్రివర్గ విస్తరణ చేపట్టిన తర్వాత జగన్ రెడ్డి కమ్మ సామాజిక వర్గం నుంచి ఒక్కరికైనా అవకాశం కల్పించారా మొదట ఒకరికి అవకాశం ఇచ్చి ఆ తర్వాత ఆయనకు కూడా లేకుండా పదవి తీసేశాడు రాష్ట్రం పుట్టినప్పటి నుంచి కమ్మ, కాపు, బీసీలు లేకుండా మంత్రివర్గాలు ఉన్నాయా ఆస్తుల విధ్వంసం, అక్రమ కేసులు, బెదిరింపులతో ఐదేళ్లు ఆ సామాజిక వర్గాన్ని వేధించిన జగన్ రెడ్డికి కమ్మ అనే పేరు ఎత్తే అర్హత ఎక్కడిది అమర్ రాజాను రాష్ట్రం నుంచి తరిమేశాడు దూళిపాళ్ల నరేంద్ర నేతృత్వంలోని సంగం డెయిరీని మూత వేయాలని కుట్రలు చేశాడు జగన్, భాష, బాడీ లాంగ్వేజ్, వ్యవహారశైలి చూసి ప్రజలందరూ అసహ్యించుకుంటున్నారు

# ఘనంగా యోగ దినోత్సవాన్ని జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు

- యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్
- జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం అమరావతి సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 21 శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలు నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, వార్డు స్థాయి నుంచి మండలస్థాయి వరకు 7వేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందరూ తమ పరిధిలో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రదేశాల్లో యోగా ట్రైనర్స్, ఇన్‌చార్జిలను నియమించి కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో సుమారు 10వేల మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత అందరిని పెద్దఎత్తున భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో నోడల్ ఆఫీసర్ యతిరాజ్, డిఇవో బాలాజీరావు, జడ్పీ సిఇవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# కలెక్టర్‌చే గిరిజన విద్యా చైతన్య యాత్రలు పోస్టర్ ఆవిష్కరణ




**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌ను నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్‌తో కలిసి పులి చెంచయ్య వ్యవస్థాపకులు గిరిజన (యానాది) విద్యా చైతన్య వేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా యానాదులలో అక్షరాస్యత మీద, విద్యా ప్రమాణాలు గూర్చి యానాదుల దయనీయ పరిస్థితులు , ఆధార్ కార్డుల గురించి కలెక్టర్‌తో మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ మరియు పులి చెంచయ్య తెలియజేయడం జరిగింది. అలాగే త్వరలో గిరిజన యువత కోసం నిర్వహించ తలపెట్టిన క్రికెట్ టోర్నమెంట్ గురించి తెలిపారు. పులి చెంచయ్య గిరిజన (యానాది) విద్యా చైతన్య వేదిక ఆధ్వర్యంలో అన్ని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందించామని తెలిపారు. యానాదులలో విద్యా చైతన్యం కోసం గిరిజన (యానాది) విద్యా చైతన్య యాత్రలు ప్రారంభం చేస్తామని తెలిపారు. అందులో భాగం అయిన గిరిజన యానాది విద్యా చైతన్య యాత్రలు పోస్టర్‌ను కలెక్టర్‌కి చూపించారు. పోస్టర్‌ను ఆసక్తిగా చూసి యానాదులలో అక్షరాస్యత శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజన యానాది విద్యా చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించి ప్రతి ఒక్క గిరిజన బిడ్డ చదువు కోవాలని తెలిపారు. గిరిజన విద్యా చైతన్య వేదిక నాయకులు అందరికీ అభినందనలు తెలియజేశారు. గిరిజన విద్యా చైతన్య వేదిక నాయకులు మానికల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య



**సైదాపురం, జూన్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన గురువారం నెలకొంది. ఎస్సై కాంతి కుమార్ వివరాల మేరకు సుమారు 35నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా కొమరి రాజు



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం అన్నగారి పాలెం పంచాయితి తుమ్మలపెంటగ్రామం పట్టపుపాలెంకు చెందిన కొమరి రాజు వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా కావలి మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గ వైయస్ఆర్‌పార్టీ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో నియమితులవడం జరిగింది. ఈ సందర్భంగా కొమరి రాజు గురువారం మాట్లాడారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా పదవి రావడానికి సహకరించిన కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియచేశారు. ఈ పదవి వచ్చిన సందర్భంగా నా బాధ్యత మరింత పెరిగిందని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయసాధనకోసం వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి అందరి సహకారంతో మరింత కృషిచేస్తానని తెలియచేశారు.

## ఖాదర్‌బాష చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మైనారిటిసెల్ కార్యదర్శి, కావలి టిడిపి నాయకులు షేక్.ఖాదర్‌బాష(ఇట్టు) ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సందర్భంగా గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢసానుభూతిని తెలియచేసి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండకిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, సోమశిల ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలి దమయంతి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త :** కావలి పట్టణ 3వ వార్డు వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మండలి కృష్ణారావు తల్లి మండలి దమయంతి ఇటీవల మృతిచెందిన సందర్భంగా గురువారం కావలి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢసానుభూతిని తెలియచేసి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, వైసిపి నాయకులు పుత్తూరు నాగాచారి, కొమరి రాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్యాయంగా నాన్నను ఇరికించారు



**ముత్తుకూరు, జూన్ 19, ప్రభాతవార్త :** నాన్నపై తప్పుడు కేసులు బనాయించి అన్యాయంగా జైలుకు పంపారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత వాపోయారు. గురువారం మండలంలోని దువ్వూరు వారిపాల్యెంలో ఆమె పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడి కోలుకున్న దువ్వూరు విజయభాస్కర్ రెడ్డిని పరామర్శిం చారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మనిషి కాకాని గోవర్ధన్ రెడ్డి పై అవినీతి ఆరోపణలు చేస్తూ అక్రమ అరెస్టు చేయించి జైల్లో పెట్టడం సమంజసం కాదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. మండలంలోని దువ్వూరు పాలెం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రజల మనిషిని ప్రజల బాగోగులు చూసుకోవడం బాగా తెలిసిన నాయకుడు అన్నారు. అయితే ప్రజలను పరామర్శించేందుకు ఆయన స్థానంలో ఆయన కుమార్తెగా ముందుకొచ్చానని, ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా తన తండ్రి వలె ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.తన తండ్రి ఏ తప్పు చేయకపోయినా తన తండ్రిని పై నిందారోపణలు చేసి అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. వాస్తవానికి ప్రజల బాగోగులు చూసుకోవడానికి, నియోజకవర్గంలో ప్రజలను పరామర్శించేందుకు తన తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి రావాల్సి ఉందని, ప్రస్తుతం ఆయన అక్కడ ఉండడంతో ఆయన స్థానంలో తన ఆయన కుమార్తెగా తాను వచ్చానని తెలిపారు. కేసులు బనాయించి నిందారోపణ చేసిన వారు తెలుసుకోవాలని హితవు పలికారు. ఎందుకంటే తన తండ్రి తప్పు చేసి ఉంటే ఇంత మంది ప్రజలు మా వెంట వుండేవారు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గండవరం సుగుణ, దువ్వూరు విశ్వమోహన్ రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఆలపాక శీనయ్య పోచారెడ్డి చంగారెడ్డి, గండవరం సూరి, సర్పంచులు కృష్ణవేణి, మస్తానమ్మ, పాముల శీనయ్య, అగ్ని, దువ్వూరు తేజా రెడ్డి, చెంగారెడ్డి, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మరో కేసులో కాకాణికి రిమాండ్



**నెల్లూరు క్రైమ్, జూన్ 19, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి రోజుకో కొత్త కేసు మెడకు చుట్టుకుంటున్నట్లు కనిపిస్తోంది. తాజాగా ముత్తుకూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి గురువారం పోలీసులు పిటి వారెంట్‌తో రైల్వే కోర్టులో హాజరుపరిచారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో అనధికారికంగా టోల్ గేట్ ఏర్పాటుచేసి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసులో ఏ 1గా కాకాణి గోవర్ధన్ రెడ్డిని కోర్టులో హాజరు పరిచారు. కాకానిపై నమోదు చేసిన 409 సెక్షన్ ఈ కేసులో వర్తించదని ఆయన తరపు లాయర్లు వాదించారు. వారి వాదనతో న్యాయమూర్తి ఏకీభవించి సదరు సెక్షన్ తొలగించాలని ఆదేశించినట్లు కాకాని తరపు లాయర్లు తెలిపారు. మరోవైపు కాకాణి జూలై మూడో తేదీ వరకు రిమాండ్ విధిస్తున్నట్లు న్యాయమూర్తి ఆదేశించారు.

## యోగేంద్ర ఏర్పాట్లు పరిశీలన



**కోవూరు జూన్ 19 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనా థమ్మ . జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 21వ తేదీ శనివారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర, కుసంబంధించి న ఏర్పాట్లను గురువారం సాయంత్రం అధికారులు ప్రజాప్రతినిధులు టిడిపి సీనియర్ నాయకులు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఎక్కడ స్టేజి ఏర్పాటు చేయాలి ఎక్కడ భారీ స్క్రీన్ ఏర్పాటు చేయాలి యోగాకు వచ్చేవారికి ఏర్పాట్లు తదితర విషయాలపై ప్రత్యేకంగా సమీక్షించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ సుబ్బయ్య ఎంపీడీవో శ్రీహరి రెడ్డి ఎంఈఓ రహీం ఎస్ డబ్ల్యు ఓ తిరుపతయ్య టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి దువ్వూరు కళ్యాణ్ రెడ్డి పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మెన్ రాజగోపాల్ రెడ్డి. బెజవాడ వంశీకృష్ణారెడ్డి జొన్నవాడ దేవస్థానం ఉత్సవ కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డినీటి సంఘం ఉపాధ్యక్షులు ఆదాల శివారెడ్డి పార్టీ సీనియర్ నాయకులు గాదిరాజు అశోక్ కుమార్ సాయి రెడ్డి ఏపీఎం సుబ్బరాజు సీసీలు రాజశేఖర్ రాము తదితరులు ఉన్నారు

## తమ ప్రభుత్వంపై బురద జల్లే ప్రక్రియను మానుకోండి



**ఆత్మకూరు, జూన్19,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టణ తెలుగుదేశంపార్టీ నేతలు పాల్గొని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తు ఇవ్వని హామీలను కూడా ప్రజలకు చెబుతూ ప్రజా ఆమోదంతో కూటమి నేతల సహకారంతో ప్రభుత్వాన్ని నిర్వహిస్తుంటే ఇది చూడలేని వైసిపి నేతలు అర్ధంపర్థం లేని ఆరోపణలు చేస్తూ తమ ప్రభుత్వంపై బురద జల్లే ప్రక్రియను మానుకోవాలన్నారు.ఐదేళ్లపాటు ప్రనజలను మోసం చేసి రాష్ట్ర ఆర్థికవ్యవమస్థను దెబ్బతీసి రాష్ట్రాన్ని అప్పులపాడు చేసి ఇష్టం వచ్చినంత దోచుకొని ప్రజల వ్యతిరేకతతో ఓడిపోయి ప్రతిపక్ష హోదా కూడా లేని ఆపార్టీ నేతలు అనవసరపు నిందలు , అర్థంపర్థం లేని మాటలు అనడం మానుకోవాలని హితవు పలికారు. మాపై బుదర జల్లే ముందుకు మీకు అంటుకున్న బురదను తుడుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్షుడు పెంచల చౌదరి, టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు పులిమి శైలజారెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ ఛైర్మెన్ వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మెన్ సర్ధార్, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, వెంకటయ్య, సాగర్, సత్యం, మస్తాన్‌నాయుడు, జయాకర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానమ్మ కుటుంబాన్ని సందర్శించిన ఆర్‌డిఓ



**ఆత్మకూరు, జూన్19ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం సి.హెచ్.యడవల్లి గ్రామంలో నివాసముంటున్న బంగారు కుటుంబాన్ని ఆత్మకూరు ఆర్‌డిఓ బి.పావని గురువారం సందర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలను దాతల సహకారంతో ఆర్థికంగా ఆదుకోవడానికి బంగారు కుటుంబంగా నామకరణం చేసింది. మండల పరిధిలోని నారంపేట పారిశ్రామిక వాడలో గత నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారంపేట గ్రామానికి వచ్చి ఈబంగారు కుటుంబ పథకానికి ఆరంభం పలికారు. చెర్లోయడవల్లి గ్రామంలోని జ్ఞానమ్మ గిరిజన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా గుర్తించారు. ఆ కుటుంబ ఆర్థిక అభివృద్ధికోసం మర్రిపాడు మండల పరిధిలోని పడమటినాయుడుపల్లికి చెందిన సాహో ఫౌండేషన్ అధినేత పడచాల నాగేశ్వరరావ్ అనే దాత ఆ కుటుంబానికి మార్గదర్శకుడిగా ఎంపికయ్యారు. నాగేశ్వరరావ్ ఇటీవల ఈ గ్రామానికి వచ్చి జ్ఞానమ్మ కుటుంబ అభివృద్ధి కోసం కుటుంబ సభ్యులతో చర్చించి వారికోరిక మేరకు ఆత్మకూరు ఆర్‌డిఓ పావని సమక్షంలో లక్షరూపాయల ఆర్థికసహాయం అందించారు. గురువారం ఆ నిధులతో జ్ఞానమ్మ కుటుంబ సభ్యులు 12మేకలను కొనుగోలు చేశారు. ఈనేపథ్యంలో ఆత్మకూరు ఆర్‌డిఓ పావని జ్ఞానమ్మ కుటుంబ సభ్యులకు సూచనలు , సలహాలు అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దాత నాగేశ్వరరావ్, ఆర్‌డిఓ పావనికి జ్ఞానమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నాగేశ్వరరావ్ తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక పురోభివృద్ధికి సహకరించారని నాగేశ్వరరావ్ సహాయాన్ని ఎన్నటికీ మరిచి పోలేమన్నారు. ఈసందర్భంగా జ్ఞానమ్మ కుటుంబ సభ్యులు తమ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా సహకారం అందించాలని వారు ఆర్‌డిఓ బి.పావని ని కోరారు.

## యోగా డే ని విజయవంతం చేయండి



**అల్లూరు, జూన్ 19 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నీ విజయ వంతం చేయండి అంటూ గురువారం అల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రజినీకాంత్ యోగా గురువులు. ఎంటిటి లు (మాస్టర్ ఆఫ్ ట్రైనిస్) తో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో టిఓటిలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రజనీకాంత్. కమిషనర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగ డే ని విజయవంతం చేయండి అంటూ రూరల్ పరిధిలో 63 సెంటర్లలో. నగర పంచాయతీ పరిధిలో 54 సెంటర్లలో శనివారం ఉదయం 6:30 నుండి 8:30 వరకు నిర్దేశించిన ప్రదేశాల్లో స్థానిక ప్రజలకు విద్యార్థులకు ఎంటీటీలు నుండి యోగ శిక్షణ పొందిన టిఓటిలు ద్వారా యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని. యోగా చేయటం వలన ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక నాయకులు. ప్రజలు. విద్యార్థులు. యోగ ఔత్సాహికులు సహకరించవలసిందిగా తెలియజేశారు.

## ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య మృతి తీరని లోటు



**నెల్లూరు రూరల్, జూన్ 19, ప్రభాతవార్త :** ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విద్యావేత్త, కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య మృతి తీరని లోటు అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఒక పాత్రికేయులుగా జీవితాన్ని ప్రారంభించి.. కళాశాల కరస్పాండెంట్ గా వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. కందుకూరు ప్రాంతానికే తలమానికమైన ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీని స్థాపించి వేలమంది విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించారన్నారు. రామయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కి, వారి కుటుంబానికి దేవుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాతఃకాలమునే స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా కేవీఎస్ కళ్యాణ మండపం అధినేత కారంశెట్టి కిరణ్‌కుమార్, లలితా వాణి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ పచ్చిపాల మల్లికార్జునరెడ్డి, భక్తులు ఉన్నారు.

**- కొనసాగుతున్న మజ్జిగ చలివేంద్రం**



స్థానిక షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంతంలో ఉన్న చలివేంద్రంలో ప్రతి గురువారం మజ్జిగ చలివేంద్రంను నిర్వహిస్తున్నారు. దివంగత పచ్చిపాల విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో తెలంగాణలో పనిచేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ పచ్చిపాల రాజా విక్రమ్‌రెడ్డి సహకారంతో క్రమం తప్పకుండా నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో

## ప్రాథమిక దశ నుంచి యోగాపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** యోగా అనేది ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తే వారి మెదడు మరింత పదును పదుతుందని యోగా గురువు బొమ్మిశెట్టి సుకుమార్ తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం యోగాసనాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. రోజూ యోగా ధ్యానం చేయడం వలన ఒత్తిడి కూడా దూరమవుతుందన్నారు. యోగా చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందని ఈ సందర్భంగా విద్యార్థినులకు సూచించారు. ఫిజికల్ డైరెక్టర్ పి. సులోచన, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ఉన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్స్ మెయింటనెన్స్ పనులను దగ్గరుండి పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ లక్ష్మీభాయ్



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త-వైద్యం :** సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఆదేశానుసారం వినియోగదారులకు మరింత మెరుగైన, సంతృప్తికర సేవలు అందించడంలో భాగంగా డైకస్ రోడ్డు సెక్షన్ పరిధిలోని అన్ని ట్రాన్స్ ఫార్మర్లను మెయింటెనెన్స్ చేయడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఈ ప్రణాళిక ప్రకారం ట్రాన్స్ ఫార్మర్లను సకాలంలో నిర్వహించడం ద్వారా ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగించవచ్చని తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్లలో చోటు చేసుకునే సాధారణ లోపాలను ముందుగానే గుర్తించి వాటిని మరమ్మత్తు చేయడం కేబుల్ భాగుందా లేదా పరిశీలన, సెక్షన్ వైర్ కరెక్ట్‌గా ఉన్నాయా లేదా కనెక్షన్ టెర్మినల్స్ తనిఖీ చేయడం, ఎర్తింగ్, భద్రతా ప్రమాణాలను పాటించడం, సాలిడ్ కోర్ ఇన్సులేటర్స్ పరిశీలించడం తదితర చర్యలు తీసుకోనున్నారు. ఈ రోజు 5 ట్రాన్స్ ఫార్మర్స్ మెయింటెనెన్స్ చేపించినట్లు తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్ నిర్వహణ జరుగుతున్న సమయంలో సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ హాజరుగా ఉండి పనుల పురోగతిని పర్యవేక్షించడం ద్వారా వినియోగదారులకు మరింత నమ్మకం కలిగించేలా చర్యలు చేపట్ట బడుతున్నామని అన్నారు. వినియోగదారుల నుండి వచ్చే అభిప్రాయాలు, ఫిర్యాదులు, సూచనలను వెంటనే స్పందించి, తగిన పరిష్కార చర్యలు తీసుకునేందుకు ముందు ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ విధిగా వినియోగదారుల సౌకర్యం, భద్రత, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నిరంతరం కృషి చేస్తానని తెలియజేశారు. ఈ మెయింటనెన్స్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ సతీష్, లైన్‌మెన్ రమేష్, సుధాకర్, యాసిర్, సర్దార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ సేవలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 19 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన పాడి రైతులు కోవూరులోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ప్రయోగశాల సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న ప్రయోగశాలను గురువారం ఆయన పరిశీలన చేపట్టారు. ఈ ల్యాబ్‌లో పశువుకు సంబంధించి పొదుగు వ్యాధి, నివారణకు సంబంధించి రక్తపరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పశువులకు సంబంధించి లివర్ ఫంక్షనింగ్ టెస్ట్ , కిడ్నీ టెస్ట్, కాల్షియం, పాస్పరస్, పాలు, పశువుకు సంబంధించిన రక్త నమూనాల పరీక్షలు కూడా ఈ ప్రయోగశాలలో ఉచితంగా రైతులకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఈ ప్రయోగశాలలో 6 వేల వరకు ల్యాబ్ పరీక్షలు కూడా చేయడం జరిగిందన్నారు. ఇదే పరీక్షలు పాడి రైతులు బయట ప్రయోగశాలలో చేయించుకోవాలంటే వందల నుంచి వేలాది రూపాయల వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రయోగశాలలో పాడి పశువుకు అందించిన అన్ని సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా పశువులకు సంబంధించి చర్మవ్యాధులు , రక్తానికి సంబంధించి పారామీటర్స్, పూర్తి పరీక్షలు కూడా ఈ ల్యాబ్‌లో అందించడం జరుగుతుందన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన పాడి రైతులు ఈ ప్రయోగశాలను సందర్శించి అవసరమైన సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జయపాల్, దిలీప్, తదితరులు ఉన్నారు.

## వికసిత్ భారత్ సంకల్పం సమావేశాన్ని నిర్వహించిన బిజెపి



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త :** భారతీయ జనతాపార్టీ కావలిపట్టణశాఖ ఆధ్వర్యంలో కావలి పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన గురువారం వికసిత్ భారత్ సంకల్ప సమావేశాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. వికసిత భారతదేశపు అమృతకాలం, సేవాసుపరిపాలన పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడి సారథ్యంలో 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రతి బూత్‌లలో బూత్ అధ్యక్షులు ఆధ్వర్యంలో కరపత్రాలు పంచాలని సూచించడం జరిగింది. భారతీయ జనతాపార్టీ సభ్యత్వాలను పెంచడం, 11 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటికి కరపత్రాల ద్వారా సమాచారం చేరవేయాలని ఈ సమావేశంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, సంక్షేమానికి నరేంద్రమోడి అందించిన సహాయ సహకారాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కరపత్రాలు పంపిణి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వైజరి కమిటి సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, జియస్‌టి మండలి సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, మాజీ పట్టణ అధ్యక్షులు బెల్లంకొండ మాల్యాద్రి, పట్టణ ప్రధానకార్యదర్శి కూరాకుల సవీంద్ర, ఉపాధ్యక్షుడు కోడూరు మురళీకృష్ణ, మైనారిటీమోర్చ అధ్యక్షులు షేక్.మస్తాన్‌బాష, కిసాన్‌మోర్చ పట్టణ అధ్యక్షులు ముంగమూరు వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి మట్టా మల్లికార్జున, పసుపులేటి సుధాకర్, వల్లపు తిరుపతయ్య, తూమాటి తిరుపతయ్యస్వామి, గురజాల వెంకటరవికుమార్, ఇన్నమూరి సుబ్రహ్మణ్యం, మేదరమెట్ల మణిదీప్, దేవుండ్ల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లిరోజు సందర్బంగా భోజనప్యాకెట్లు వితరణ



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు కానిస్టేబుల్ షేక్.బాబుల్, రమీజ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా గురువారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణ పరిసరప్రాంతమైన బుడమగుంట గిరిజనకాలనీలోని పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. తమ యొక్క సంస్థ ద్వారా పేదలకు ఆకలితీర్చిన దాతలు షేక్.బాబుల్, రమీజ దంపతులకు ధన్యవాదాలు తెలియచేశారు. ఇలాంటి పెళ్లిరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు.

## శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానాన్ని సందర్శించిన సోమిరెడ్డి

**నెల్లూరు జూన్19,ప్రభాతవార్త:** మండలం నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానాన్ని సందర్శించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికిన ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేలు శ్రీ వెంగమాంబ అమ్మవారి విశిష్టత నేపథ్యంలో పుణ్యక్షేత్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించిన కాకర్ల..అభినందించిన సోమిరెడ్డి శ్రీ వెంగమాంబ పేరంటాలు ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, వెంగమాంబ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించిన సోమిరెడ్డి..

## అమ్మ మనసు



**బిట్రగుంట జూన్ 19 ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల ఆర్.ఎస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల లో డిఎస్సి పరీక్షలకు బందోబస్తు గా వచ్చిన బిట్రగుంట పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ శిరీష అమ్మ మనసు చాటుకొని అందరి మన్ననలను పొందిన సంఘటన జరిగింది. వివరాలలోకి వెళ్తే డిఎస్సి పరీక్ష రాయడానికి వచ్చిన ఒక అభ్యర్థి తన చంటి బిడ్డను తండ్రికి అప్పచెప్పి పరీక్ష వ్రాయడానికి లోపలికి వెళ్ళింది. కొద్దిసేపటికే చంటిబిడ్డ ఏడవడం మొదలు పెట్టింది. ఎంత సమాదాయించిన ఏడుపు ఆపకపో వడంతో బందోబస్తుకు వచ్చిన మహిళా పోలీస్ చంటిబిడ్డను అక్కుకు చేర్చుకొని సమదా యించి పాలు ఇచ్చి మాతృత్వాన్ని చాటుకొన్నారు. దీంతో అక్కడి వారంతా శెహబాష్ శిరీష అని అభినందించారు.

## స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పార్కులు అభివృద్ధి చేస్తాం



**నెల్లూరు రూరల్, జూన్ 19, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21, 22 , 23 డివిజన్‌లలో పార్కులకు స్థానిక ప్రజలతో కలిసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. శంకు స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడుతూ 150 కోట్లు విలువ చేసే స్థలాలను భావితరాలకు, ప్రజలకు చెందే విధంగా కాపాడుతాం అన్నారు. పార్కులను అభివృద్ధి మాత్రమే చేస్తాం. పార్కుల నిర్వహణ బాధ్యత స్థానిక ప్రజలదే అని చెప్పారు. ఎన్నికలు లేనివేళ రాజకీయపార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుదాం అని తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎప్పుడూ జరగని అభివృద్ధి ప్రజల సహకారంతో జరుగుతుందిఅని అన్నారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుద్ధ్యం మన లక్ష్యం

### - హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు



**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పారిశుధ్య పరిస్థితులను మరింత మెరుగుపరచాలని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు సూచించారు. నెల్లూరు జీజీహెచ్ లోని తన ఛాంబర్లో బుధవారం ఆయన శానిటేషన్ సూపర్‌వైజర్లతో సమావేశంనిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు వందలాది మంది రోగులు వస్తుంటారని వారికి ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా పారిశుద్యాన్ని మెరుగుపర్చాలన్నారు. జీజీహెచ్‌లోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్ల సమస్య ఉండడంతో వాటిని పరిష్కరించేందుకు కొన్ని సూచనలు జారీ చేశారు. విధి నిర్వహణ పట్ల ప్రతి ఒక్కరు అంకిత భావంతో రోగులకు సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు దార్ల మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల వలయంలో జెండాదిబ్బ



**సంగం జూన్ 19 ప్రభాతవార్త** సంగం మండలం జెండాదిబ్బ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. బుచ్చిరెడ్డిపాళెం నుండి జెండాదిబ్బకు వచ్చే రోడ్డు దయనీయంగా వుంది. ద్విచక్రవాహనదారులు గుంటల రోడ్డులో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారిన ప్రభుత్వాలు మారినా దండు బాటకు మాత్రం సిమెంట్ రోడ్డు మంజూరు కావడం లేదు.అలాగే జెండాదిబ్బ మొత్తం పేద నిరుపేద కుటుంబాలే ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా ఇక్కడ ప్రజలకు ఇళ్ళ స్థలాలు అందని ద్రాక్ష పండులాగా మారిపోయాయని ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి గత ఎన్నికలలో మంచి మెజార్టీ కూడా వచ్చిందని ఆ గ్రామ ప్రజలు చెబుతున్నారు. మంత్రి స్పందించి ఇళ్ళ స్థలాలు, బుచ్చిరెడ్డిపాళెం నుండి వచ్చే రోడ్డు బాగు చేయించడం, దండు బాటు వేయించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గుర్రపు డెక్కను తొలగించి ఘాట్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచండి : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 19 ప్రభాతవార్త:** రాష్ట్ర పండుగగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ బారాషాహీద్ దర్గా గంధ మహోత్సవాలను పురస్కరించుకొని స్వర్ణాల చెరువులోని గుర్రపు డెక్క ఆకును పూర్తిగా తొలగించి, ఘాట్ ప్రాంతంలోని చెరువు నీరు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక బారా షహీద్ దర్గా స్వర్ణాల చెరువు ప్రాంతంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న గుర్రపు డెక్క ఆకు తొలగింపు పనులను కమిషనర్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూలై నెల 6 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రొట్టెల పండుగను పురస్కరించుకొని దర్గా ప్రాంగణం మొత్తం అత్యంత పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వర్ణాల చెరువును పరిశుభ్రంగా ఉంచేందుకు గుర్రపు డెక్క ఆకును పూర్తిస్థాయిలో తొలగించి, ఘాట్ పరిసర ప్రాంతాలలో నీరు స్వచ్ఛంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ఘాట్ ప్రాంతంలోని నీటిలో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, చెరువులో వ్యర్థాలు వేయకుండా అదేవిధంగా దర్గా ప్రాంగణంలో బహిరంగ ప్రదేశాలలో ఏలాంటి వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.

**- టాక్స్ రీసర్వే రికార్డులను తనిఖీ** అనంతరం స్థానిక స్టోన్ హౌస్ పేట 8/2 సచివాలయాన్ని కమిషనర్ సందర్శించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న ప్రాపర్టీ టాక్స్ రీ సర్వే పనుల రికార్డులను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా నిర్దేశించిన ప్రాపర్టీ టాక్స్ రీసర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం లక్ష్మీ సాయి నగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు, నారాయణ మెడికల్ కళాశాల రోడ్డు తదితర ప్రాంతాలలోని భవనాలను కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్ తో సరిపోల్చి చూశారు. అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవిన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికవర్‌లో అత్యాధునిక పద్ధతుల్లో మెకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు




**నెల్లూరు, జూన్ 19, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో అత్యాధునిక పద్దతులతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ బీఎల్ఎస్ కుమార్‌బాబు, డాక్టర్ కే.శశిధర్‌రెడ్డి, డాక్టర్ ఎంసీ వినోద్ కుమార్‌రెడ్డి, డాక్టర్ సందేశ్ రెడ్డి తెలిపారు. మోకాళ్ల నొప్పితో నిత్యం నరకం అనుభవించే వారు ఈ ఆపరేషన్ చేయించుకుని నూతన నొప్పి లేని జీవితాన్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు ఎవరికి అవసరం, శస్త్ర చికిత్సలు ఎన్ని రకాలు, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై డాక్టర్ బీఎల్ఎస్ కుమార్ బాబు, డాక్టర్ కే.శశిధర్‌రెడ్డి, డాక్టర్ ఎంసీ వినోద్ కుమార్‌రెడ్డి, డాక్టర్ సందేశ్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. దెబ్బతిన్న మోకాలి కీలు భాగాలను కృత్రిమ ఇంప్లాంట్‌లతో భర్తీ చేసే వైద్య ప్రక్రియనే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స అంటారని తెలిపారు. తీవ్రమైన ఆర్థరైటీస్(కీళ్ల వాతం), గాయాలు, కీలు సమస్యల వల్ల మోకాళ్లలో తీవ్రమైన నొప్పి, కదలికల్లో ఇబ్బందులు ఉన్న వారికి మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సను సిఫార్సు చేస్తామన్నారు. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు వివిధ రకాలుగా ఉంటాయని వైద్యులు పేర్కొన్నారు. అందులో ఒకటి మొత్తం మోకాలి మార్పిడి అని చెప్పారు. ఇది అత్యంత సాధారణ రకం అని, ఈ శస్త్ర చికిత్సలో మోకాలి కీలులోని మూడు భాగాలు( తొడ ఎముక చివరి భాగం, కాలి ఎముక పై భాగం, మోకాలి చిప్ప వెనుక భాగం) దెబ్బతినప్పుడు వాటిని లోహపు ప్లాస్టిక్ ఇంప్లాంట్స్‌లతో భర్తీ చేస్తారని వెల్లడించారు. పాక్షిక మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స ఇంకొకటని చెప్పారు. మోకాలి కీలులోని ఒక భాగం మాత్రమే దెబ్బతిన్నప్పుడు ఈ రకమైన శస్త్ర చికిత్సను చేస్తారన్నారు. ఈ శస్త్ర చికిత్స చేయించుకున్న వారు త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. అలాగే మోకాలి చిప్ప లేదా దాని గాడి మాత్రమే ప్రభావి తమైనప్పుడు మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్స చేస్తారని మెడికవర్ ఆర్థోపెడిక్ సర్జన్లు వెల్లడించారు. రివిజన్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స కూడా ఉందన్నారు. గతంలో చేసిన మోకాలి మార్పిడి ఇంప్లాంట్ అరిగిపోయినప్పుడు, వదులైనప్పుడు లేదా వాటికి ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు ఈ శస్త్ర చికిత్సను నిర్వహిస్తారని ఇది మొదటి సారి చేసిన ఆపరేషన్ కంటే మరింత క్లిష్టమైనదిగా ఉంటుందన్నారు. రెండు మోకాళ్లకు ఒకే సారి శస్త్ర చికిత్స చేసే విధానాన్ని ద్వైపాక్షిక మోకాలి మార్పిడి అంటారని వెల్లడించారు. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స చేసేందుకు ఒకటి నుండి రెండు గంటల సయమం పడుతుందని, రోగికి సాధారణ అనస్థీషియా గానీ లేదా రీజనల్ అనస్థీషియా ఇస్తారన్నారు. శస్త్ర చికిత్స చేసే వైద్యులు మోకాలిపై ఒక కోత పెట్టి, దెబ్బతిన్న ఎముకను తొలగించి దాని స్థానంలో కృత్రిమ ఇంప్లాంట్స్ ను అమరుస్తారనివెల్లడించారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సను అధునాతన పద్దతుల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ బీఎల్ఎస్ కుమార్‌బాబు, డాక్టర్ కే.శశిధర్‌రెడ్డి, డాక్టర్ ఎంసీ వినోద్ కుమార్‌రెడ్డి, డాక్టర్ సందేశ్‌రెడ్డి వెల్లడించారు. అధునాతన పద్దతుల్లో శస్త్ర చికిత్స చేయడం ద్వారా రోగికి తక్కువ నొప్పి కలిగి త్వరగా కోలు కునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. మెడికవర్‌లో 15 నుండి 20 ఏళ్ల వరకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఉండే నాణ్యమైన ఇంప్లాంట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.మోకాలి మార్పిడి ఆపరేషన్ చేసిన తర్వాత రోజు నుండే ఫిజియోథెరపీని ప్రారంభిస్తామని కేవలం 2 నుండి 4 వారాల్లోపే నొప్పి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. రోగి పూర్తిగా కోలుకోవడానికి ఫిజియోథెరపినే కీలకమని వెల్లడించారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో రోబోటిక్ విధానంలో కూడా మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. రోబోటిక్ విధానం ద్వారా పూర్తి ఖచ్చితత్వంతో ఇంప్లాంట్స్‌ను అమర్చగలమని వెల్లడించారు. రోబోటిక్ విధానంలో కంప్యూటర్ నావిగేషన్ ద్వారా చికిత్సకు ముందు మోకాలి 3డీ మోడల్‌ను సృష్టించి ఖచ్చితంగా ఇంప్లాంట్స్ అమర్చే ప్రాంతాన్ని గుర్తిస్తామన్నారు. 3డీ ప్రింటెడ్ ఇంప్లాంట్లు కూడా మెడికవర్ అందుబాటులో ఉన్నాయన్నారు. మోకాలి నొప్పి మీ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంటే వెంటనే నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌ను సంప్రదించి నొప్పిలేని జీవితాన్ని ప్రసాదించే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సను చేయించుకోవాలని డాక్టర్ బీఎల్ఎస్ కుమార్ బాబు, డాక్టర్ కే.శశిధర్‌రెడ్డి, డాక్టర్ ఎంసీ వినోద్ కుమార్‌రెడ్డి, డాక్టర్ సందేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## జనసేన ఆధ్వర్యంలో కోడి వ్యర్థాల వాహనాలను అడ్డుకుంటాం

### - చేపలు,రొయ్యల సాగుదారులు పర్యావరణానికి హాని కలిగిస్తే ఉపేక్షించం

### - జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు వెల్లడి




**నెల్లూరు, జూన్19 ప్రభాతవార్త-విద్య** పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే విదంగా కోడి వ్యర్థాలతో వ్యాపారాలు సాగించే దందాలను తమ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని జనసేన పార్టీ నెల్లూరు నగర అధ్యక్షులు దుగ్గి శెట్టి సుజయ్‌బాబు తెలిపారు. గురువారం నగరంలోని స్థానిక ఆ పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల తరువాత మన జిల్లాలోనే చేపలు, రొయ్యల సాగు ఆ స్థాయిలో జరుగుతుదన్నారు. వీటి పెంపకం కోసం రైతుల్లో కొందరు కోడి వ్యర్థాలను వాటికి ఆహారంగా ఇచ్చి పెంపకం చేస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయటం ద్వారా పర్యావరణంతోపాటూ ప్రజల ఆరోగ్యాలు కూడా పూర్తిగా నాశనం అవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే అధికారులు అనేక మార్లు ఆయా వాహనాలపై దాడులు చేసి స్వాదీనం చేసుకున్నా కోడి వ్యర్థాల అక్రమ రవాణా ఆగటం లేదన్నారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లో తాము ఉపేక్షించబోమని , జిల్లా వ్యాప్తంగా ఇలా అక్రమంగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇదే విషయాన్ని తమ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెల్లి జిల్లాతో పాటూ రాష్ట్రంలో ఈ సమస్య లేకుండా చేసేందుకు కృషిచేస్తామన్నారు. జనసేన సర్వేపల్లి ఇన్‌చార్జ్ సురేష్, కోవూరు ఇన్‌చార్జ్ శ్రీనివాసులు రెడ్డిలు మాట్లాడుతు జిల్లాలో కోడి వ్యర్థాలతో చేపల మేత వ్యాపారం తారాస్థాయికి చేరిందన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఈ వ్యర్థాల రవాణాను బాగా ప్రోత్సహించిందని ఆరోపించారు. ఆక్వారైతులు ఇప్పటికైనా ఇటువంటి వ్యర్థాలను వినియోగించకుండా ఉండాలని, ఇలా ఎవరైనా వినియోగిస్తే ఆయా ప్రాంతాల్లోని జనసేన నాయకులను తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆలియా, నాయకులు భవాని నాయుడు, అజయ్‌బాబు, చిత్తూరు రాము, శ్రీమంతుల కిషోర్, శ్రీనివాసులు, ఆముదాల సుమంత్, బాలు, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి

### మాజీ ఎమ్మెల్యే మేకపాటి



**ఆత్మకూరు, జూన్19, ప్రభాతవార్త:** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ప్రనమాదాల నియంత్రణకు మరణాలు సంభవించకుండా అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖద్వారా విజ్ఞప్తి చేశారు. నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి ఆత్మకూరు నియోజకవర్గంలో సంగం మండలం జెండాదిబ్బనుండి జిల్లా సరిహద్దు బాట వరకు విస్తరించి ఉందన్నారు. దీని నిర్వహణ చాలా నాసిరకంగా ఉందని ముఖ్యంగా ప్రమాద హెచ్చరికలు లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అంతేకాక సైన్‌బోర్డులు, రోడ్డు మార్కింగ్, లైటింగ్, గుంటలు పూడ్చడం, డ్రెయిన్లు, సంక్షన్ల అభివృద్ధి లేని కారణంగా ప్రమాదాలు రోజురోజుకు పెరుగు తున్నాయన్నారు. గతంట ఈ విషయమై లేఖ ద్వారా అధికారులకు సూచించామన్నారు.జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రయాణాలు సాగించే వారికి రక్షణ లేకుండాపోయిందని నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజలు ఈరోడ్డు ప్రమాదాల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయమై మా దృషి ్టకి తెచ్చారన్నారు. వెంటనే అధికారులు ఆత్మకూరు నియోజకవర్గంలోని జాతీయ రహదారి అభివృద్ధి పనులు చేపట్టి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు జాతీయ రహదారి ప్రయాణాలకు తగ్గట్లుగా రోడ్డు పనులు చేపట్టి ప్రజల

## జర్నలిస్ట్ పిల్లలు ప్రైవేటు పాఠశాలలో 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా ఏపీఎంఎఫ్ అధ్యక్షుడు మల్లి పిలుపు



**నెల్లూరుకలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 50 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌కు నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరే షన్ అధ్యక్షుడు ఇసనాకుల మల్లికార్జున్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ డీఈ ఓకి ఫోన్ ఫోన్ ద్వారా జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం రాయితీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కావున ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జర్నలిస్టుల మిత్రులందరూ 50 శాతం రాయితీ కొరకు డీఈవోకి పిల్లల వివరాలు తెలియజేస్తే స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి అమలుచేస్తారని తెలియజేశారు. స్టాఫ్‌కెమెరామెన్లు ప్రవీణ్,ప్రదీప్,మనోజ్,సురేంద్ర, అభిషేక్,పలువురుజర్నలిస్టులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో రెవెన్యూ దినోత్సవం వేడుకలు

### - ఏ.పి.రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన రెవెన్యూ డే కార్యక్రమాలు




**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాత వార్త** గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అహర్నిశలు ప్రజా సేవలో నిమగ్న మై అంకిత భావంతో సేవలందిస్తున్న నెల్లూరు జిల్లా రెవె న్యూ శాఖలోని ప్రతీ రెవెన్యూ ఉద్యోగికి ఏ.పి.రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన రెవెన్యూడే శుభాకాంక్షలు తెలియచేస్తు. రెవె న్యూశాఖ అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చెయ్యడానికి రెవెన్యూ డేను జిల్లా కేంద్రంగా గురువారం నాడు ఉదయం 11:30 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవనంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి జే. ఉదయ భాస్కర్, ఏఓ విజయ కుమార్ పాల్గొననున్నారు.

## నర్రవాడ వెంగమాంబ సేవలో పుట్టా దంపతులు



**బుచ్చి జూన్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలం టిడిపినాయకులు, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు, ఆయన సతీమణి కౌన్సిలర్ పుట్టా లక్ష్మీ కాంతమ్మ నర్రవాడలోని వెంగమాంబను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్రవాడ వెంగ ామాంబతల్లిని దర్శించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పలువురున్నారు.

## విద్యాశాఖాధికారి సుప్రియకు డాక్టరేట్ ప్రధానం



**సైదాపురం, జూన్ 19, ప్రభాతవార్త** మండల విద్యాశాఖ అధికా రి-2గా విధులు నిర్వహిస్తు న్నట్లు వి.సుప్రియకు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో డాక్టరేట్ ప్రధానం చేశారు. ప్రొఫెసర్ డి.ఉషారాణి ఆధ్వర్యంలో సుప్రియకు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ ఉమెన్ స్టడీస్ విభాగంలో ఇన్ఫ్లుయెన్స్ ఆఫ్ హోమ్ అండ్ స్కూల్ ఎన్విరాన్‌మెంట్ ఆన్ ది వేల్యూస్ ఆఫ్ ఆడోలసెంట్ గర్ల్స్- ఎ క్రాస్ కల్చరల్ స్టడీ అనే అంశంపై పరిశోధన చేసిన చేసినందున డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషొత్తం శివకుమార్ ఆమెకు అభినందనలు తెలిపారు.

## ఒక పోరాటయోధుడు ఓలేటి నాగేశ్వరరావు :ఎమ్మెల్యే



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త** తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం, అంకితమైన వృత్తికోసం నిరంతరం పోరాటం చేసిన ఒక పోరాట యోధుడు, వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్యప్రముఖులు, కావలి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు ఓలేటి నాగేశ్వరరావు అని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలియచేశారు. పత్రికారంగంలో 40 సంవత్సరాలు నుండి ఎనలేని కృషి చేసిన ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందడం జరిగింది. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గురువారం కావలి కొత్తబజారులోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామ ర్శించారు. తన ప్రగాఢసానుభూతిని వ్యక్తంచేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. ఓలేటి నాగేశ్వరరావు తన కలంద్వారా అనేక సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరి ష్కారం చేశారన్నారు. ఒక మిత్రుడుగా అనేక సలహాలు అందించేవాడని తెలియచేశారు. ఆయన లేనిలోటు వ్యక్తిగతంగా తనకు,కావలి నియోజకవర్గానికి తీరలిలోటు అని తెలి పారు.పాలక పక్షాన్ని ఎప్పుడూప్ర శ్నించేవ్యక్తి ఓలేటి అని సాధారణంగా పాలకపక్షానికి అనుకూలంగా నడిచే రోజుల్లో కూడా సమస్యలను వెలుగెత్తి చాటిచెప్పడంలో కాని,స్పం దించే విధానంలో కాని, సమస్యలను ప్రజల ముంగిట పెట్టడంలో కాని, పాలకపక్షానికి వ్యతిరేకంగా పనిచేస్తూ నిరంతరం ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో ఓలేటి పాత్ర చాలా గొప్పదన్నారు. ఎంతోమంది శిష్యులను తయారుచేసి ఒకే ఒక పంథాన్ని ఎంచుకుని వృత్తినే దైవంగా భావిస్తూ, వృత్తికి ఎక్కడాకూడా కళంకం లేకుండా ఎటువంటి ఆర్థిక, రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా నిరాడంబర జీవితాన్ని కొనసాగించారని తెలియచేశారు. కావలిలో పనిచేసిన ఎమ్మెల్యేలందరికి కూడా సలహా దారుడయ్యారన్నారు. నేను 2005లో రాజకీయ ఆరంగ్రేటం చేసిన రోజుల నుండి నాకు ఒక అజ్ఞాతగురువుగా నిలిచిపోయారన్నారు. నేను నడిచే నడకలో ఓలేటి పాత్ర ఎంతో ఉందన్నారు. ఆయనను కోల్పోవడం చాలా బాధకరమని, ఆయన ఆశయాలను కొనసాగించే విధంగా ముందుకు నడుద్దామని, దినచర్యలో కూడా ఆయన పాత్ర ఉంటుందని తెలియచేశారు. ఓలేటి నాగేశ్వరరావు ఆత్మ కావలిలో సంచరిస్తూ ఉంటుందని, ఒక మంచి ధృవతారను కోల్పోయామని, ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ పట్టణ అధ్యక్షులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, టిడిపి నాయకులు తిరివీధి ప్రసాద్, మోడ్రన్‌స్టోర్ అధినేత మద్దుల నరసింహారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓలేటి మరణం పత్రికారంగానికి తీరనిలోటు: మాజీ ఎమ్మెల్యే



**కావలిరూరల్, జూన్19 ప్రభాతవార్త** వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్య ప్రము ఖులు, కావలి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు ఓలేటి నాగేశ్వరరావు మృతి పత్రికారంగానికి, కావలి పట్టణ ఆర్యవైశ్యులకు తీరనిలోటు అని కావలి నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి, కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి కొత్తబజారులోని ఆయన నివాసానికి గురువారం వెళ్లారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఓలేటి నాగేశ్వరరావు సమాజానికి మంచి చేయాలని ఎల్లవేళలా పరితపించేవారని తెలియచేశారు. ఆయన రాసిన కథనాలు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచాయన్నారు. యువ జర్నలిస్టులను తయారు చేసి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. సంస్థపేరును ఇంటిపేరుగా మలుచుకుని ఓలేటి నాగేశ్వరరావు వార్త నాగేశ్వరరావుగా పేరు గడించారన్నారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్య క్షుడిగా అందరి సహకారంతో ఆలయాన్ని పూర్తిచేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలియచేశారు. ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్యవైశ్యులకు పెద్ద దిక్కుగా నిలవడం గర్వకారణ మన్నారు. మీడియావారికి కూడా ఒక పెద్దదిక్కుగా నిలిచారన్నారు. అందరి మన్ననలను పొందిన ఓలేటి నాగేశ్వరరావు మన మధ్య లేకపోవడం బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పందిటి కామరాజు, వైసిపి నాయకులు షేక్. షాహులుహమీద్, పుత్తూరు నాగాచారి, కొమరి రాజు, బాలాజి హైర్స్ అధినేత బొగ్గవరపు సత్యనారాయణ, వైసిపి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.